# అనుమానస్పద మృతి కాదు హత్యే..

వ్యవసాయం చేస్తు జీవనం సాగించే ముత్యంకు పొరుగున ఉన్న ఊరుకు చెందిన మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఆ కారణంగా గతంలో ఎకరం భూమి విక్రయించారు. అంతే గాకుండా ఇటీవల కాలంలో 8 నుంచి తొమ్మిది తులాల బంగారు ఆభరణాలను విక్రయించడంతో ఇంటిలో గొడవలు జరుగుతున్నాయి. కుటుంబ ఆర్థిక సమస్యలు, మృతుడి అక్రమ సంబంధ కారణంగా తాము రోడ్డున పడతామని అతని భార్య లలిత, కుమారుడితో కలిసి ఈ నెల 6న ముత్యం తన ఇంటిలో మద్యం సేవించి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో చీర అంచుముక్కతో మెడ బిగించి హత్య చేయగా, కొడుకు కాళ్లు పట్టుకొని సహకరించినట్లు విచారణలో తేలింది. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా మద్యం మత్తులో మంచం మీద నుండి పడిపోయి చనిపోయినట్లుగా నమ్మించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. మృతుడి కుటుంబ సభ్యులకు అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీస్ విచారణ చేపట్టి ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. ఈ కేసులో పుంటికూర లలిత, ఆమె కొడుకులను కోర్ట్ ముందు హాజరు పరుచగా నేరానికి ఉపయోగించిన చీర ముక్క, చెద్దరి కత్తెరను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ కు పంపినట్లు ఎస్ఐ శ్యామ్ రాజు వెల్లడించారు.

# నాడు తాలు తీస్తే తోలు తీస్తా అన్న రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎవరి తోలు తీయాలి





బాల్కొండ, బతుకమ్మ :రైతులు కష్టపడి పండించిన పంటను నిలువు దోపిడీ చేస్తున్నారు. గతంలో పిసిసి అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి తాలు తీస్తే తోలు తీస్తా అన్నారు. ఇప్పుడు మరి ఎవరి తోలు తీయాలి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కిలో తరుగు తీస్తే గొడవ చేసిన వారు ఇప్పుడు క్వింటాల్ కు 4 నుంచి 5 కిలోల తరుగు తీస్తే ఎందుకు మౌనం వహిస్తున్నారు?" అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం భీమ్‌గల్ మండలం బడా భీమ్‌గల్ గ్రామంలోని ఐకేపీ, ప్యాక్స్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులను పరిశీలించిన ఆయన, అక్కడ నెల రోజులుగా ధాన్యపు కుప్పల వద్దే నిరీక్షిస్తున్న రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రైతులు తమ గోడును ఎమ్మెల్యేకు వివరిస్తూ, ఏప్రిల్ 2, 3, 5 తేదీలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చినా ఇప్పటివరకు తూకం వేయలేదని, లారీలు రాకపోవడంతో ధాన్యం కుప్పలు అలాగే పేరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బడా భీమ్‌గల్ గ్రామంలోని ఒక్క సెంటర్ లోనే సుమారు 50 లారీలకు కు పైగా ధాన్యం కుప్పలు పెండింగ్‌లో ఉన్నాయని రైతులు తెలిపారు. రైతుల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి వెంటనే జిల్లా కలెక్టర్, జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్ఓ) లకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. హమాలీలు, లారీల కొరత పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని, యుద్ధ ప్రాతిపదికన లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం సేకరణ వేగంగా జరుగుతోందని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని అన్నారు. "నెల రోజులుగా ఒక్క గింజ కూడా తూకం వేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం" అని విమర్శించారు. దొడ్డు వడ్ల పేరుతో రైతులను వేధించడం దారుణమని ఆయన అన్నారు. సన్న వడ్లకు ప్రకటించిన బోనస్ కుడా అందక రైతులకు సరైన లాభం చేకూర్చడం లేదని, దిగుబడి తక్కువగా రావడం వల్లే రైతులు దొడ్డు వడ్లు పండిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అన్ని రకాల ధాన్యాన్ని ఎలాంటి వివక్ష లేకుండా కొనుగోలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. అలాగే తరుగు పేరుతో జరుగుతున్న కోతలపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "క్వింటాల్‌కు 4 నుంచి 5 కిలోల వరకు తరుగు తీస్తున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఇప్పటికే బస్తాల్లో నింపిన ధాన్యం తడిసి ముక్కిపోతుందని తెలిపారు. రైతుల శ్రమ వృథా కాకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు."నేను వ్యక్తిగత పర్యటన కోసం అమెరికాలో ఉన్నప్పటికీ, రైతులు పడుతున్న కష్టాల గురించి తెలిసి వెంటనే నియోజకవర్గానికి వచ్చాను. రైతుల సమస్యలపై ప్రతి రోజు పర్యవేక్షణ చేస్తాను. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి గింజను కొనుగోలు చేయాలి. రైతులకు చెల్లించాల్సిన సొమ్మును వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలి. లేదంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతుంది" అని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హెచ్చరించారు.

# కొడంగల్ బాలాజీ దేవస్థాన పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సీఎం





కొడంగల్, బతుకమ్మ :పేదల తిరుపతిగా ఖ్యాతి పొందిన కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మీ వెంకటేశ్వరస్వామి (కొడంగల్ బాలాజీ) ఆలయ పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వేదపండితుల సమక్షంలో నిర్వహించిన భూమి పూజ, యాగంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. అనంతరం కొడంగల్ బాలాజీ ఆలయ పునర్నిర్మాణంతో పాటు కొడంగల్ లో 430 పడకల ఆసుపత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతూ శిలాఫలకాలను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

## ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిరక్షణకు పోరాటం కొనసాగుతుంది

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరణ చేయకుండా పరిరక్షించాలని, బ్యాంకు ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలుగా నిలుస్తున్నాయని, ప్రజలకు అందుబాటులో సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. బ్యాంకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో తగిన సిబ్బంది కొరత, పెరుగుతున్న పని ఒత్తిడి, భద్రతా సమస్యలు, మహిళా ఉద్యోగులపై వేధింపులు వంటి అంశాలు ఉన్నాయని తెలిపారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, బ్యాంకుల విలీనాలతో ఉద్యోగులపై భారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన పెన్షన్ విధానం ఉద్యోగులకు నష్టం కలిగిస్తోందని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే డీఏ, పెంఛన్ సవరణలు, ఉద్యోగ భద్రత, పదోన్నతులలో పారదర్శకత కల్పించాలని కోరా రు. బ్యాంకింగ్ రంగంలో ప్రైవేటీకరణ వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్రంగా నష్టపోతారని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూల విధానాలు అవలంబిస్తూ ప్రభుత్వ రంగ బ్యాంకులను బలహీనపరుస్తోందని ఆరోపించారు. బ్యాంకు ఉద్యోగుల హక్కులను కాపాడేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.




## జవహర్ నవోదయ క్యాంపస్ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :జక్రాన్ పల్లి మండలం కలిగోట్ లో నెలకొల్పనున్న జవహర్ నవోదయ విద్యాలయ కొత్త క్యాంపస్ భవన నిర్మాణం పనుల పురోగతిపై కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతతో వేగంగా జరిపించాలని, విద్యార్థులకు అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జవహర్ నవోదయ ఇన్ చార్జి ప్రిన్సిపాల్ పి.జోజి బాబు, డిఈఓ అశోక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీలను యధావిధిగా కొనసాగించాలి

### హెడ్ క్వార్టర్ ఎంపీటీసీ మారంపల్లి సుధాకర్ డిమాండ్



ఇందల్ వాయి, బతుకమ్మ :ప్రస్తుతం ఉన్న ఎంపీటీసీలను ప్రభుత్వం యధావిధిగా కొనసాగించాలని హెడ్ క్వార్టర్ ఎంపీటీసీ మారంపల్లి సుధాకర్ అన్నారు. శుక్రవారం సాయి బాబా మందిరంలో తాజా, మాజీ ఎంపీటీసీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో మాజీ చైర్మన్ లకే మళ్లీ చైర్మన్ గా అవకాశం ఇచ్చినందున ఎంపీటీసీలను సైతం అదే తరహాలో కొనసాగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలను, అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి కోసం నిత్యం గ్రామాలలో తిరుగుతూ అభివృద్ధి చెందేందుకు ఎంపీటీసీలు ఎంతో దోహదపడతారని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల తాజా, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## దోన్ పాల్ గ్రామంలో వైద్య శిబిరం



మోర్తాడ్, బతుకమ్మ:ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మోర్తాడ్ మండలంలోని దోన్ పాల్ గ్రామంలో పశువైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ ఆరోగ్య శిబిరంలో 48 గేదెలకు వైద్యం అందించారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముత్యాల రాములు, గ్రామ సర్పంచ్ ముత్యాల బాజమ్మ, వీడీసీ అధ్యకులు పర్సా రాజేందర్, ఉపాధ్యకులు టి. రాజేందర్, పర్సా దేవేందర్, రేసం రాజేందర్, కూర్మ రమేష్, కోరం సాయికుమార్, ఎం. రాజశేఖర్, శ్రీనివాస్, సిహెచ్ సాయికిరణ్, పశువైద్యాధికారి డా.గౌతమ్ రాజు, సిబ్బంది షేక్, ప్రభాకర్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

